# మనుషుల భయం




అప్పుడే నిద్రపట్టబోతున్న మూర్తి గోలకి ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచాడు. అప్పటికే అరుగుమీదకి వచ్చేసారు ఎదురింటివాళ్ళు.

"అమ్మో.... అమ్మో...." అంటోంది ఆవిడ. కుర్రాణ్ణెత్తుకుని ఆవిడ వెనకాలే ఉన్నాయన అరవటంలేదు గాని పిరికి పిరిగ్గా దిక్కులు చూస్తున్నాడు.

"ఏమిటి.... ఏమైందండీ....?" అన్నాడు మూర్తి పూర్తిగా మెళుకువ తెచ్చుకుంటూ.

"పామండీ.... పాము.... మా యింట్లో...." అంది కంగారుగా ఆవిడ. ఈలోగా యింట్లోంచి మూర్తి భార్య, అత్తగారు బయటికొచ్చారు. ఈ హడావిడికి రోడ్డుమీద వెళ్లేవాళ్ళు ఒకళ్ళిద్దరు ఆగిపోయారు. ఈ పక్కింటివాళ్ళు, ఆ పక్కింటివాళ్ళు అందరూ చేరారు.

'ఏమిటి నాయనా.... ఏమిటి?'

'ఏమైందండీ...?'

అయిదు నిమిషాల్లో అందరికీ తెలిసిపోయింది ఎదురింట్లో పాము గురించి.

"అదేమిటి అందరూ అలా ఊరుకుంటారు.... పాముని కొట్టేవాళ్ళనెవర్నేనా పిలవండి. విషప్పురుగుని అలా వొదిలేస్తే మరో కొంపలో చేరుతుంది" అందో ముసలావిడ.

అక్కడ చేరినవాళ్ళలో ఎక్కువమంది ఆడాళ్లే. ఒకళ్ళిద్దరు మొగాళ్లున్నా ఆడవాళ్ళ వెనకాలే నిలబడున్నారు.

ఎలాంటి పాము... తాచవునా, కాదా... ఎంత పొడుగుంది.... నల్లగా ఉందా... ఎర్రగా ఉందా.... యిలా అన్ని మాటలు సాగినా అక్కడివాళ్ళలో పాముని కొట్టగలవాళ్లెవరూ బయటపడలేదు. ఎక్కడ తనని ప్రయత్నించమంటారోనని భయంవేసింది మూర్తికి.

వారంరోజులు సెలవుపెట్టి, అత్తారింట్లో హాయిగా తిని పడుకుందామని ఆ ఊరొచ్చాడు మూర్తి. వేసవి మధ్యాహ్నం, అందులో సుష్టుగా భోజనం పడిందేమో కమ్మటి నిద్రొస్తోందని చల్లగా అరుగుమీద వేశాడు మకాం. నిద్ర పాడవటం అటుంచి యిప్పుడీ పాము బెడదొకటి.

పాము విషయంలో తనని వాళ్లెవరూ యిరికించకముందే అక్కణ్ణించి లోపలికి వెళ్లిపోతే బాగుణ్ణు అనుకున్నాడు మూర్తి. చుట్టూ దిక్కులు చూశాడు. ఎదురింట్లోంచి వచ్చినవాళ్ళు, తమింట్లోంచి వచ్చినవాళ్ళు దారికి అడ్డంగా ఉన్నారు. వాళ్ళందర్నీ తప్పించుకుని లోపల కెళ్ళటానికి కొంచెం సిగ్గేసింది. తప్పనిసరై మూర్తి భయాన్ని సిగ్గు జయించింది. యింక ఏం చెయ్యటానికీ తోచక అలాగే అందరివేపూ చూస్తూ ఉండిపోయాడు. ఉండి కాస్సేప్పటికి మరీ ఏం చెయ్యకపోతే బావుండదన్నట్టు.... "యిలా కూచోండి, ఊరికే కంగారు పడకండి...." అన్నాడు ఎదురింటి వాళ్ళకి మంచి చూపిస్తూ....

"అలాగే.. . అలాగే...." అని కూచున్నాడు ఎదురింటాయన పిల్లాణ్ణి వొళ్లో కూచోపెట్టుకుంటూ. ఆయన పక్కనే ఆవిడా కూచోబోతూ ఒక్కసారి "అమ్మోయ్.... చంటిది.... చంటిందండోయ్...." అంది.

"చంటిదేమిటే.... అవును చంటిదేదీ...." అన్నాడాయన.

"ఉయ్యాల్లో.... ఉయ్యాల్లో ఉండిపోయిందండి.... ఎలాగా.... యిప్పుడెలాగా.... సరిగ్గా పాము కూడా అదే గదిలో ఉంది.... పిల్లెలాగా...." అంటూ ఏడుపు మొదలెట్టిందావిడ.

"పిల్లనొదిలేసి ఎలా వచ్చావే..." అంటూ హడావిడిగా ఆయనా లేచాడు.

"పాపిష్టిదాన్ని.... కంగారులో మరిచిపోయాను...." అంది ఏడుస్తూనే ఆవిడ. అలా అంటూనే రెండడుగులు ముందు కేసింది.

"ఉండు.... ఎక్కడికీ...." అన్నాడాయన ఆవిణ్ణి పట్టుకుంటూ.

"పిల్లని తీసుకొస్తా... వదలండి..." అంది ఆవిడ మరో అడుగు ముందుకు వేస్తూ....

"మతేమేనా పోయిందేమిటి.... ఆ గదిలోనే పాముంది.... మరిచిపోయావా..." అన్నాడాయన మరింత గట్టిగా పట్టుకుంటూ.

"ఉంటే ఉంది.... పిల్లని అలా వదిలేయటమే..... కరిస్తే నన్నే కరుస్తుంది.... పిల్లని తీసు కొచ్చేస్తా...." అంటూ గింజుకోటం మొదలెట్టింది.

"పాపం చంటిపిల్ల అక్కడే ఉండిపోయిందిట...."

"అయినా తల్లిప్రాణం.... పాముని లెక్క చేస్తుందా.... చూడండి ఎలా కొట్టుకులాడుతోందో ఆవిడ మనసు... ఎంత కష్టం వచ్చిందో పాపం...."

చుట్టూ మరింత గోల పెరిగింది.

ఆవిడ మరింత గింజుకుంటోంది. కాస్సేపాగితే ఆయన యింక ఆవిణ్ణి అలా పట్టుకుని ఆపలేడేమో అనిపించింది మూర్తికి.

యీలోగా మూర్తి అత్తగారు ముందుకొచ్చి ఆవిణ్ణి పట్టుకుంది.

"ఉండు సుబ్బులు... ఊరిగే కంగారుపడకు. పిల్ల ఉయ్యాల్లోనే ఉందికదా.... మరేం కంగారు లేదు. ఉయ్యాల కనపడుతూనే ఉంది. పిల్లలేస్తే తెలుస్తుంది... అంతగా అవసరం అయితే అలాగే వెడుదువుగాని.... యీలోగా ఎవర్నైనా పిలిపించి యీ పాము గొడవ వదలించుకుందాం....." అంది.

"అవునే కంగారుపడకే..." అన్నాడాయన కూడా.

కాస్సేపటికి సుబ్బులు గింజుకోటం మానేసింది కానీ ఏడుపు మానలేదు.

నలుగురి సలహాలు, సంప్రదింపులూ అయ్యాక ఎవరో పరిగెత్తుకెళ్ళారు పక్కవీధికి. ఆ వీధిలో పాముని కొట్టగలిగే రాజుని తీసుకురావటంకోసం.

మూర్తి అత్తగారు నచ్చచెప్పి సుబ్బుల్ని పక్కకి తీసికెళ్ళింది.

వచ్చేవాళ్ళు.... అడిగేవాళ్ళు.... చెప్పేవాళ్ళు.... గోలగోలగా ఉన్నా.... ఎడారిలో యిసుక చప్పుళ్ళా ఉంది తప్ప, అంతమంది మనుషులు అక్కడున్నట్టు లేదు..... పాము భయం మరి.

ఎదురింటాయన నెమ్మదిగా మంచం మీద కూలబడ్డాడు. పక్కనే మూర్తి కూచున్నాడు.

"ఇళ్ళకోసం ఊరంతా వెతికానండీ... ఎక్కడా దొరక్క, అంతంత అద్దె లిచ్చుకోలేక, అద్దె తక్కువని యీ చివరి వీధికొచ్చాను. యిలా పాముల బెడదుందంటే చచ్చినా వచ్చేవాడిని కాదు. ఓ వందో, యాభయ్యో పోతే తట్టుకోవచ్చు, దొంగలు పడితే తట్టుకోవచ్చు. అంతేకానీ యిలా యింట్లో పాములుంటే ఎలాగండీ చావటం... యీ కష్టం గడిస్తే డబ్బుకోసం వెనకా ముందు చూడను... వేరే యింటికి మారిపోతా..." అన్నాడాయన మూర్తితో.

"నిజమే.... నిజమే...." అన్నాడు మూర్తి. అప్పటిదాకా తన గొడవలో తనున్న మూర్తికి ఆ మాటలు విన్నాక ఆయన మీద జాలేసింది. తనలాగే ఆయనా పాములంటే భయపడే మనిషనేటప్పటికి ఆ భయం మరింత పెరిగింది. పాము వచ్చింది వాళ్లింట్లో కాబట్టి కానీ, అదే తమింట్లో అయితేనో అనుకునేటప్పటికి ఒళ్ళంతా ఒక్కసారి జలదరించింది మూర్తికి.

పక్కవీధికి వెళ్ళిన మనిషి తిరిగొచ్చాడు. అతని కూడా వచ్చిన రాజు సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. లుంగీ... చొక్కా, చేతిలో కర్ర... ముప్పై లోపు వాడే.... గుంపుగా ఉన్న జనం పక్కకి జరిగారు అతనికి చోటిస్తూ....

"ఎక్కడండీ పాము...." అన్నాడు అతను.

"అదిగో ఆ వెంకట్రావుగారింట్లో...." అన్నాడు రాజుని తీసుకొచ్చినతను.

వెంకట్రావు రాజు దగ్గరకెళ్ళి తన యిల్లు.... గది చూపించి వివరాలు చెప్పాడు.

రాజు నెమ్మదిగా ఎదురింటివేపు కదిలాడు. చూస్తున్న గుంపు కూడా ఓ అడుగు ముందుకేసింది.

అరుగెక్కి కిటికీదాకా వెళ్ళి లోపలికి చూసిన రాజు వెనక్కి తిరిగి వెంకట్రావుని రమ్మని పిలిచాడు.

ఓ క్షణం తటపటాయించి తప్పదన్నట్టు కొడుకుని భార్యకిచ్చి నెమ్మదిగా వెళ్ళాడు. వెళ్ళి కిటికీలోంచి లోపలి బీరువావేపు చూపించాడు వెంకట్రావు.

కాస్సేపు చూసి వెనక్కి తిరిగి మూర్తున్న అరుగుమీదకి వచ్చేశాడు రాజు.

"నా పిల్ల ఆ ఉయ్యాల్లో ఉండిపోయింది.... ఎలాగేనా ఆ పాముని చంపి పుణ్యం కట్టుకో బాబూ..." అంది సుబ్బులు రాజు దగ్గరికొస్తూ.

"ఎలాగమ్మా దాన్ని కొట్టడం.... సరిగ్గా బీరువాకి, గోడకి మధ్యలో ఉండిపోయింది. బీరువా కోడుపక్కనే ఉంది తల.... కర్రదెబ్బ పడే అవకాశమే లేదు.... చాలాసేపటి నుంచీ అక్కడే ఉందంటున్నారు. ఏ ఎరనేనా మింగిందో.... బీరువాకి, గోడకి మధ్య యిరుక్కుపోయిందో.... అయిదారుగురి సాయం ఉంటేనే కానీ ఎవరం ఏం చెయ్యలేం.... ముందు కొందరు బీరువా జరపాలి.... మిగిలినవాళ్ళు దెబ్బ కాయాలి...." అన్నాడు.

పది నిమిషాలు గడిచినా రాజుకి సాయం నిలవగలిగే మనుషులెవరో ఎవరికీ తట్టలేదు. మరికొంచెంసేపు చూసి ఎవరేనా మనుషులు దొరికాక తనకి కబురుపెట్టమని వెళ్ళిపోయాడు రాజు.

"ఎలాగండీ.... మన పిల్లెలాగండీ...." అంటూ మళ్ళీ ఏడుపు మొదలెట్టింది సుబ్బులు వెంకట్రావుని పట్టుకుని.

వెంకట్రావుకి ఏం చెయ్యాలో తోచక గుంపులో అందరివేపు దిక్కులు చూశాడు.

"తాలూకా ఆఫీసు దగ్గర పాములు పట్టే సాయిబున్నాడు..... వాణ్ణి పిలిస్తే సరి...." అన్నారెవరో గుంపులోంచి

"వాడో పట్టాన్నిరాడు. వచ్చినా అంత తొందరగా పని తెమల్చడు. అందులో పసిపిల్ల గదిలో ఉందంటే వాడి ఆశకి అంతే ఉండదు.... వాణ్ణి భరించటం కష్టం...." అన్నారు మరెవరో.

అన్నీ వింటున్నా ఏం చెయ్యటానికీ తోచనట్టు, చేష్టలుడిగినవాడిలా అలాగే కూచుండిపోయాడు వెంకట్రావు. భార్యలా ఏడవటం లేదుగానీ అంతకన్నా దారుణంగా ఉంది అతని ముఖం.

యింకేం దారి లేనప్పుడు కష్టమో, నష్టమో ఆ పాముల సాయిబుని పిలిపించటమే మంచిదని చెపుదామనుకున్నాడు మూర్తి వెంకట్రావుకి.

యింతలో.... "ఏమిట్రా వెంకట్రావ్.... ఏమైంది...." అంటూ గుంపుని తప్పించుకుని ముందు కొస్తున్న అతన్ని చూసి ఒక్కుదుటున లేచాడు వెంకట్రావు.

"పామురా రామం.... మా యింట్లో పామురా...." అన్నాడు యింటివేపు చూపిస్తూ కంగారుగా.

అతను వెంకట్రావుతోపాటే ఆఫీసులో పనిచేస్తున్న స్నేహితుడని మూర్తికి పరిచయం అయ్యాక తనే అన్ని వివరాలు చెప్పాడు మూర్తి. చెప్పి.... "యింక ఆ పాముల సాయిబును పిలిపించటం ఒక్కటే దారి అనిపిస్తోంది...." అన్నాడు.

"వొద్దులెండి.... వాడు దొరకటం కష్టం... రోజూ ఏదో ఓ ఊరు పోతుంటాడు. పైగా మనం చెప్పినట్టు వినే రకంకాదు. మంత్రాలు, తంత్రాలు అని నానా హడావిడి చేస్తాడు. మా ఆఫీసు దగ్గర ఎరుకల వాళ్ళున్నారు. పాముని పట్టడమంటే వాళ్ళకి నిముషం పని.... వెళ్ళి వాళ్ళ నెవరినేనా తీసుకొస్తా...'
' అని మరోసారి వెంకట్రావుకి ధైర్యం చెప్పి వెళ్ళాడు రామం.

రామం తిరిగొచ్చేవరకు గుండెలు అరచేతిలో పెట్టుక్కూచున్నాడు వెంకట్రావు. పావుగంట

గడవకముందే రామం తిరిగొచ్చాడు. కూడా వచ్చిన వాడు ఎరకలాడని తప్పితే వాడి పేరూ, ఊరూ ఎవరికీ తెలియదు. నల్లగా ఉన్నాడు.... వొంటిమీద గోచీ.... చేతిలో బద్దలాంటి కర్రా తప్ప మరేం లేవు.

సంగతి చెప్పి యిల్లు చూపించగానే తిన్నగా లోపలికి కెళ్ళిపోయాడు. వాడు గది గుమ్మం దాటి లోపలి కెళ్ళటం అందరికీ కనిపిస్తూనే ఉంది. ఎప్పుడు కదిలిందో సుబ్బులు కూడా ఒక్క అంగలో రోడ్డు దాటింది.

ఆడది వొక్కర్తీ ఆ గుమ్మం ఎక్కటం చూసి మరొకళ్ళిద్దరు కూడా ముందుకి నడిచారు.

గది గుమ్మం దగ్గర్నించే.... "ఉయ్యాల్లో పిల్ల... పిల్ల...." అంది సుబ్బులు.

ఓ క్షణం సుబ్బులువేపు చూసి ఆగమన్నట్టు సైగచేశాడు, ఎరకలాడు. చికిలి కళ్ళు చిట్లించి బీరువావేపు చూశాడు. ఓ చేత్తో కర్ర సరిచేసుకుని నెమ్మదిగా ముందుకి కదిలాడు.

ఓ చేత్తో కర్రతోటి పామువేపే చూస్తూ, రెండో చేత్తో ఉయ్యాల్లో పిల్లని లేవతీశాడు. వాడలా పిల్లని తీసీ తియ్యగానే ఓ అడుగు లోపలికేసి పిల్లని అందుకుంది సుబ్బులు. ఈ చేతుల మార్పుకి పిల్ల ఒక్కసారిగా ఏడుపు మొదలెట్టింది.

పిల్ల ఏడుపుకి ఓసారి తల కొంచెం కదిపి బుస్సుమంది పాము.

మెరుపు కదినట్టు గబుక్కుమని ముందుకెళ్ళి చేతిలోని కర్రని బద్దలా ఉన్నవేపు పాము పీకమీద వేసి నొక్కాడు ఎరకలాడు.

"యింక పాము కదలదు.... రండి, బీరువా జరపండి...." అన్నాడు గుమ్మం దగ్గరున్న వాళ్ళని చూస్తూ.

ధైర్యం చేసి వెంకట్రావు ముందుకొచ్చాడు. అతనితో మరో ముగ్గురొచ్చి బీరువా జరిపారు.

బీరువా జరపగానే వొంగుని కర్ర అదిమిపెట్టిన చోటుకి కొంచెం పైన తల దగ్గర వొడుపుగా పట్టుకున్నాడు పాముని. పట్టుకుని అలాగే బయటికొచ్చాడు.

ఉత్తప్పుడు రోడ్డు మీద వెడుతుంటే.... తాగుబోతు వెధవ.... దరిద్రపు వెధవ అని తిట్టే జనం మధ్యలోకి, అంతసేపు వాళ్ళందర్నీ భయపెట్టిన పాముతోటి వచ్చాడు ఎరకలాడు.

"ఎంత పెద్దదో..... నల్లతాచు.... కరిస్తే యింక తిరుగుండదు...."

"ఏ పనికేనా సులువు తెలియాలి...."

గుంపులో గోల మళ్ళీ మొదలైంది.

పెద్ద బరువు దిగిపోయినవాడిలా రామం భుజం మీద చెయ్యి వేశాడు వెంకట్రావు.

పిల్లని గుండెల్నిండా అదుముకుని సుబ్బులు కూడా ముందుకొచ్చి పాముని చూసింది. వెంకట్రావు దగ్గర తీసుకుని ఓ అయిదు రూపాయలు ఎరకలాడి కిచ్చాడు రామం. ఆ నోటు చూసి చెయ్యి ముందుకు చాపలేదు వాడు.

"అయిదేంటండీ.... ఏదేనా యిప్పించండి....." అన్నాడు.

"చాల్లేరా చెప్పేవ్.... పొద్దున్నించీ సాయంత్రందాకా కూలిచేస్తే అయిదు రూపాయలు రావు, పావుగంట పనికి అయిదు రూపాయిలిస్తుంటే నెప్పిగా ఉందేమిటి...." అన్నాడు రామం చేయి వెనక్కి తీసుకోకుండా.

"పావుగంటేందండీ.... పని ఎంత పెమాదమో చూశారా..... చూడండి ఎంతుందో పాము...."

అన్నాడు ఎరకలాడు, పామున్న చేతిని ముందుకు చాపి చూపిస్తూ.

తల వాడివేళ్ళ మధ్య యిరుక్కుపోగా, మిగిలిన శరీరాన్నంతా వాడి చేతికి చుట్టేసి, నల్లగా, భయంకరంగా ఉంది పాము. దాన్ని చూసి కన్ను చెదిరినా, మళ్ళీ లౌక్యాన్ని, వాదనని, డబ్బు తెలివితేటల్ని కూడగట్టుకున్నాడు రామం.

"అలవాటయిన పనికి ప్రమాదమేంటిరా.... అయినా సాయంత్రానికల్లా దాన్ని చంపి చర్మం అమ్మేస్తావు. అదో పదేనా వొస్తుంది.... యిదో అయిదు... చాలదేమిటి...." అన్నాడు.

"అలా అనకండి బాబూ.... పది యిప్పించండి...." అన్నాడు ఎరకలాడు బతిమాలుతూ.... రామం వాదనకి ఎదురు నిలిచే తెలివితేటలు లేనట్టు.

వెంకట్రావు రామాన్ని దగ్గరికి పిలిచాడు.

"పోనీలే యిచ్చేద్దాం.... పెద్దగా బేరం ఎందుకు..." అన్నాడు.

"ఏడిశావులే.... నీకు తెలియదు. యిప్పుడు మరో అయిదు యివ్వటం కోసం కాదు.... యిలా అలవాటు చేస్తే మరోసారి మాట వినరు వెధవలు. మనకే కాదు యీ అవసరం.... ముందు ముందు ఎవరికొచ్చినా వీళ్ళు యింక కొండెక్కి కూచుంటారు...... నే చెప్తాగా.... నీకెందుకు.... నువ్వూరుకో...." అంటూ వెంకట్రావు జేబులోంచి మరో రెండు రూపాయల కాయితం తీసుకుని ముందుకి నడిచాడు రామం.

"యిదిగో బాబుగారు సంతోషంగా మరో రెండు రూపాయిలిచ్చారు..... యింక మాట్లాడకుండా తీసికెళ్ళు....." అన్నాడు రామం.

ఆ నోట్లవేపు చూశాడే తప్ప తీసుకోలేదు ఎరకలాడు. దిగులు ముఖంతో గుంపంతటినీ చూశాడు. వాడి ఆ చూపులు..... చిన్నవవుతున్న వాడి కళ్ళు చూసేటప్పటికి మూర్తికో ఆలోచన వచ్చింది.

'వీళ్ళూరికే బేరాలాడుతున్నారు కానీ..... యాభయ్యో, వందో యివ్వకపోతే పట్టుకున్న పాముని మళ్ళీ యింట్లో వొదిలేస్తానని ఎరకలాడు బెదిరిస్తేనో....' అని. ఆ ఆలోచనతో భయం కూడా వేసింది మూర్తికి.

"ఊరికే. దిక్కులు చూడక తీసుకోరా....." అన్నాడు రామం కొంచెం గట్టిగా.

రామం చేతిలోని ఏడు రూపాయిలు అయిష్టంగానే తీసుకుని ముందుకి కదిలాడు ఎరకలాడు.

గుంపులోంచి వొక్కొక్కరే వెళ్ళిపోటం మొదలెట్టారు.

చేసిన సాయానికి రామానికి థేంక్స్ చెపుతూ యింటివేపు నడిచాడు వెంకట్రావు.

మంచం మీద మళ్ళీ పడుకోవాలనిపించలేదు మూర్తికి. కూచున్నాడు. అలా కూచున్న కాస్సేపటికి..... నల్లగా, గోచీతో.... చిలికి కళ్ళతో, ఓ చేతికి మెలిచుట్టుకున్న పాముతో యిందాకటి ఎరకలాడు గుర్తొచ్చాడు.... డబ్బు అయిష్టంగా తీసుకున్న వాడి ముఖం గుర్తొచ్చింది.

'వాళ్ళివ్వకపోతే పోనీ నేనేనా యిచ్చుంటే ఆ మిగిలిన మూడు రూపాయిలు బావుండేది...' అనుకున్నాడు.

'వాళ్ళంత నిక్కచ్చిగా ఉన్నప్పుడు.... గొప్పగా తానివ్వటం బావుండదులే...' అని మళ్ళీ తనకి తనే నచ్చచెప్పుకున్నాడు. అయినా మనసు కుదుటపడలేదు మూర్తికి.

వీధి మళ్ళీ సద్దుమణిగి ఎండవేడిలోకి వొదిగిపోయింది.

ఎంత కాదనుకున్నా యిందాకటి ఎరకలాడి కళ్ళల్లో అసంతృప్తే గుర్తొస్తోంది మూర్తికి.

'వాడెందుకలా తప్పనిసరైనట్టు ఆ ఏడు రూపాయిలు తీసుకున్నట్టు.... బెదిరించేనా తనకి కావాల్సిన డబ్బు వసూలు చేసుకునే అవకాశం ఉంది. అయినా వాడెందుకలా చెయ్యలేదు. వాడికా ఆలోచన రాకా....' వెంటనే సమాధానం తట్టలేదు మూర్తికి.

మనసు యిబ్బందిగా ఉండి అటూ యిటూ దిక్కులు చూశాడు. ఎదురిల్లు, అరుగు... వీధి చూస్తుంటే యిందాకటి పాము గుర్తొచ్చింది. ఆ పాముని చూసి తను పడ్డ భయం గుర్తొచ్చింది.

డబ్బు తీసుకునే ముందు గుంపు అందరివేపూ చూసిన ఎరకలాడి కళ్ళు గుర్తొచ్చాయి. అలా చూస్తున్నప్పుడు చిన్నవైన వాడి కళ్ళలో లీలగా మెదిలిన బెదురు, తప్పనిసరిగా రామం చేతిలో ఏడు రూపాయలవేపు చాపిన వాడి చెయ్యి కళ్ళముందు మెదిలాయి మూర్తికి.

• *యువ మాసపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక - 1977*